ఐటీ పరిశ్రమలాగే సినీ పరిశ్రమను ప్రోత్సహిస్తాం

- తెలంగాణ గద్దర్ ఫిల్మ్ అవార్డ్స్ కార్యక్రమంలో సిఎం రేవంత్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఐటీ పరిశ్రమలాగే సినీ పరిశ్రమను ప్రోత్సహిస్తామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. శనివారం హైదరాబాద్‌లో తెలంగాణ గద్దర్ సినీ అవార్డ్స్ 2024 ప్రదాన కార్యక్రమం జరిగింది. సిఎం రేవంత్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...కాంగ్రెస్ ప్రభుత్వం సినీ పరిశ్రమను గౌరవించి 1964లో నంది అవార్డులు ఇవ్వాలని ఆనాడు నిర్ణయం తీసుకుందని అన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన పదేళ్ల తరువాత గద్దర్ పేరుతో అవార్డులు అందిస్తున్నామని చెప్పారు. భారతీయ సినీ పరిశ్రమ అంటే తెలుగు సినీ పరిశ్రమ అని చెప్పారు. తెలుగు సినీ పరిశ్రమకు హైదరాబాద్ వేదికైందని అన్నారు. కొన్ని విషయాల్లో రాష్ట్ర ప్రభుత్వం కొంత కఠినంగా కనిపించినా అది పరిశ్రమ అభివృద్ధి కోసమేనని చెప్పారు.

సినీ పరిశ్రమకు ఏం కావాలో చెప్పండి - రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని సిఎం భరోసా ఇచ్చారు.

తన 22 ఏండ్ల క్రియాశీల రాజకీయాల్లో ఏ హోదాలో ఉన్నా సినీ పరిశ్రమ అభివృద్ధికి సహకరించానని తెలిపారు. 2047 విజన్ డాక్యుమెంట్‌లో సినీ పరిశ్రమ అభివృద్ధికి ఒక అధ్యాయం ఉంటుందన్నారు. 2047 నాటికి రాష్ట్ర ఏకానమీని మూడు మిలియన్ డాలర్లకు చేరుస్తామని చెప్పారు. గతంలో భారతీయ సినిమా అంటే బాలీవుడ్ అనేవాళ్లు. తెలుగు సినీ పరిశ్రమ అంటే చెన్నైలో ఉందని మాట్లాడుకునేవారు. కానీ, ఇప్పుడు భారతీయ సినీ పరిశ్రమ అంటే తెలుగు ఇండస్ట్రీ అని, అందుకు హైదరాబాద్ వేదికని మీరు నిరూపించినందుకు రాష్ట్ర ప్రభుత్వం తరపున అభినందిస్తున్నా. సినీ పరిశ్రమకు సంబంధించి మొదటి తరం ఎన్టీఆర్, ఏయన్నార్.. రెండో తరం.. కృష్ణ, శోభన్‌బాబు, కృష్ణంరాజు.. మూడోతరం చిరంజీవి, బాలకృష్ణ, వెంకటేశ్, నాగార్జున.. ఇప్పుడు ఇక్కడ నాలుగో తరం సినీ పరిశ్రమ ఇక్కడ ఉంది. వారిలో పవన్ కల్యాణ్, మహేశ్‌బాబు, అల్లు అర్జున్ ఇంకా చాలా మంది ఉన్నారు. విద్యార్థి దశలో నాకు తెలిసిన వారు ఇప్పుడు ఇండస్ట్రీలో బాగా రాణిస్తున్నారు. ముఖ్యంగా బన్ని, వెంకట్, అశ్వనీదత్ అమ్మాయిలు, ఆయన అల్లుడు నాగ్ అశ్విన్ ఇలా చాలా మంది నాకు తెలుసు. వాళ్లంతా గొప్ప నటులు, దర్శకులు, నిర్మాతలుగా రాణించడం సంతోషంగా ఉంది"

విజన్-2047లో ఫిల్మ్ ఇండస్ట్రీకి ఒక చాప్టర్



సిఎం రేవంత్‌రెడ్డి నుంచి ఉత్తమ నటుడు అవార్డు అందుకున్న అల్లు అర్జున్

'రాష్ట్ర ప్రభుత్వం కఠినంగా కనిపిస్తుంది. కానీ, మిమ్మల్ని అభిమానంగా చూసుకుంటుంది. మీ అభివృద్ధికి తోడ్పాటునందిస్తుంది. ప్రభుత్వం నడిపేటప్పుడు కొన్ని కఠిన నిర్ణయాలు తీసుకున్నా, అది మిమ్మల్ని ప్రోత్సహించడానికి, అభినందించడానికి, మీకు సముచిత స్థానం కల్పించడానికి ఈ రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నం చేస్తోంది. 'తెలంగాణ రైజింగ్- 2047'తో నినాదంతో ముందుకు సాగుతున్నాం. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి వందేళ్లు పూర్తయిన సందర్భంగా ప్రపంచంలో అభివృద్ధి చెందిన దేశాల సరసన మనం నిలవాలి. అన్ని రంగాల మాదిరిగానే ఫిల్మ్ ఇండస్ట్రీ కూడా రాణించాలని మా ప్రభుత్వం ఆలోచన. ఈ రోజు ప్రపంచమే గుర్తించే విధంగా అద్భుతమైన సినిమాలు తీసే రాజమౌళిలాంటి దర్శకులు హాలీవుడ్‌ను ఈ గడ్డపైకి ఎందుకు తీసుకురావటం లేదు. మీకు రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలబడుతుంది. అందుకు మీకు ఏం కావాలో చెప్పండి. మీకు కావాల్సిన సదుపాయాల కల్పిస్తాం. ఇక్కడి నుంచి 22 సంవత్సరాలు క్రియా శీలక రాజకీయాల్లో ఉంటా. ఏ హోదాలో ఉన్నా మీకు అండగా ఉంటాను. ఉత్తమ నటీ నటులకు అవార్డులను సిఎం ప్రధానం చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క, మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఎఫ్‌డిసి ఛైర్మన్ దిల్‌రాజు సినీ ప్రముఖులు పాల్గొన్నారు.

ఎవరెవరు ఏ విభాగంలో అవార్డు అందుకున్నారంటే..?

- ఉత్తమ నటుడు: అల్లు అర్జున్
- ఉత్తమ నటి: నివేదా థామస్ (35 చిన్న కథ కాదు)
- ఉత్తమ దర్శకుడు: నాగ్ అశ్విన్
- ప్రథమ ఉత్తమ చిత్రం: కల్కి 2898 ఏడీ
- ద్వితీయ ఉత్తమ చిత్రం: పొట్టేల్
- తతీయ ఉత్తమ చిత్రం: లక్కీ భాస్కర్
- ఉత్తమ బాలల చిత్రం: 35 చిన్న కథ కాదు
- ఉత్తమ ప్రజాదరణ చిత్రం: ఆయ్: మేం ఫ్రెండ్సండీ
- ఉత్తమ సహాయ నటుడు: ఎస్‌జే సూర్య (సరిపోదా శనివారం)
- ఉత్తమ సహాయ నటి: శరణ్య (అంబాజీపేట మ్యారేజ్ బ్యాండ్)
- ఉత్తమ సంగీత దర్శకుడు: భీమ్స్ సిసిరోలియో (రజాకార్)
- ఉత్తమ నేపథ్య గాయకుడు: సిధ్ శ్రీరామ్: ఊరు భైరవ కోన (నిజమే నే చెబుతున్నా)
- ఉత్తమ నేపథ్య గాయని:శ్రేయా ఘోషల్: పుష్ప2 (సూసేకి అగ్గిరవ్వ మాదిరి..) (హాజరు కాలేదు)
- ఉత్తమ కొరియోగ్రాఫర్: గణేష్ ఆచార్య (దేవర- ఆయుధపూజ)
- ఉత్తమ యాక్షన్ కొరియోగ్రఫీ: చంద్రశేఖర్ రాథోడ్ (గ్యాంగ్‌స్టర్)
- ఉత్తమ హాస్యనటుడు: సత్య, వెన్నెల కిషోర్ (మత్తు వదలరా2)
- ఉత్తమ స్క్రీన్‌ప్లే రచయితగా వెంకీ అట్లూరి (లక్కీ భాస్కర్)
- ఉత్తమ సినిమాటోగ్రాఫర్: విశ్వనాథ్ రెడ్డి (గామి)
- ఉత్తమ ఆర్ట్ డైరెక్టర్: అధ్నితిన్ జిహానీ చౌదరి (కల్కి 2898 ఏడీ)
- ఉత్తమ మేకప్ ఆర్టిస్ట్: నల్ల శ్రీను (రజాకార్)
- ఉత్తమ కాస్ట్యూమ్ డిజైనర్: అర్చనా రావు, అజయ్‌కుమార్ (కల్కి 2898 ఏడీ)
- ఉత్తమ ఎడిటర్: నవీన్ నూలి (లక్కీ భాస్కర్)
- ఉత్తమ గేయ రచయిత: చంద్రబోస్ (రాజు యాదవ్)
- ఉత్తమ కథా రచయిత: శివ పాలడుగు (మ్యూజిక్ షాప్ మూర్తి)
- ఉత్తమ ఆడియోగ్రాఫర్: అరవింద్ మేనన్ (గామి)
- ఉత్తమ చైల్డ్ ఆర్టిస్ట్: అరుణ్ దేవ్ (35: చిన్న కథ కాదు), హారిక (మెర్సీ కిల్లింగ్)
- ఫీచర్ ఫిల్మ్ ఆన్ నేషనల్ ఇంటిగ్రేషన్ కమ్యూనల్ హార్మోనీ సోషల్ అప్లిఫ్ట్: కమిటీ కుర్రాళ్లు
- ఉత్తమ చారిత్రక చిత్రం :రజాకార్
- స్పెషల్ జ్యూరీ: దుల్కర్ సల్మాన్ (లక్కీ భాస్కర్)
- స్పెషల్ జ్యూరీ: అనన్య నాగళ్ల (పొట్టేల్)
- స్పెషల్ జ్యూరీ: సుజిత్, సందీప్ (క)
- స్పెషల్ జ్యూరీ: ప్రశాంత్‌రెడ్డి, రాజేశ్ (రాజు యాదవ్)
- జ్యూరీ స్పెషల్ మెన్షన్ : ఫరియా అబ్దుల్లా (మత్తువదలరా)
- ఉత్తమ తొలి చిత్రం: యదు వంశీ (కమిటీ కుర్రాళ్లు)


స్పెషల్ అవార్డ్స్

- ఎన్టీఆర్ నేషనల్ ఫిల్మ్ అవార్డు: నందమూరి బాలకష్ణ
- పైడి జైరాజ్ అవార్డు: మణిరత్నం
- బీఎన్‌రెడ్డి ఫిల్మ్ అవార్డు: సుకుమార్
- నాగిరెడ్డి అండ్ చక్రపాణి ఫిల్మ్ అవార్డు: అట్లూరి పూర్ణ చంద్రరావు
- కాంతారావు ఫిల్మ్ అవార్డు: విజయ్ దేవరకొండ
- రఘుపతి వెంకయ్య అవార్డు: యండమూరి వీరేంద్రనాథ్

ఈ సందర్భంగా జ్యూరీ కమిటీనీ సత్కరించారు. మురళీ మోహన్, జయసుధ తదితరులు పురస్కారాలు అందుకున్నారు. వేదికపై పలువురు ఇచ్చిన ప్రదర్శనలు ఆహూతులను మెప్పించాయి.

వికలాంగులకు స్వర్ణయుగం

- సిఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సిఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వంలో వికలాంగులకు స్వర్ణయుగం ప్రారంభమైందని తెలంగాణ వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్య అన్నారు. శనివారం హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో సిఎం రేవంత్‌రెడ్డికి భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్‌రెడ్డితో కలిసి ముత్తినేని సిఎం చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. దేశ చరిత్రలోనే వికలాంగులకి 40శాతం వైకల్యం కే ఉచిత పరికరాలు అందించేలా జీవో 89తో పాటు వికలాంగులను వికలాంగులు పెండ్లి చేసుకుంటే రూ.లక్ష రూపాయలు అదనపు ప్రోత్సాహకం ఇవ్వాలని ఉత్తర్వులు ఇవ్వడం గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో స్టేట్ జనరల్ సెక్రటరీ చారి, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు దేశ గాని సతీశ్ గౌడ్, హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు సిరిగిరి రజినీ, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు మద్యపాగ సురేష్, మేకల సమ్మయ్యతో పాటు వికలాంగులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఉపాధి హామీ కూలీల సమస్యలు పరిష్కరించాలి

- సిఎంకు వ్యవసాయ కార్మిక సంఘం వినతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఉపాధి హామీ కూలీల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం (ఎఐఎడబ్ల్యుయు) విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి నాగయ్య, ఆర్ వెంకట్రాములు శనివారం సిఎం రేవంత్‌రెడ్డిని కలిసి వినతి పత్రాన్ని సమర్పించారు. ఉపాధి సిబ్బంది వేతనాలు పెంచాలని కోరారు. ఖాళీగా ఉన్న ఫీల్డ్ అసిస్టెంట్ల పోస్టులని భర్తీ చేయాలని విజ్ఞప్తి చేశారు. పెండింగ్‌లో ఉన్న ఉపాధి కార్మికుల వేతనాలు విడుదల చేయాలని కోరారు. రాష్ట్రంలో గత నాలుగు నెలల నుండి మధ్యలో కార్మికుల బకాయిలున్నాయని తెలిపారు. దరఖాస్తు పెట్టుకున్న వారికి కొత్త జాబ్ కార్డులు ఇవ్వడం లేదనే విషయాన్ని సిఎం దృష్టికి తీసుకుపోయారు. జాబు కార్డులో కొత్తగా పేర్లు నమోదు చేసుకునేందుకు అవకాశం లేదనీ, దీని వల్ల పనిచేయడానికి సిద్ధంగా ఉన్న అనేకమంది పనికి దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పని ప్రదేశంలో కనీస సౌకర్యాలు లేవనీ, పే స్లిప్పులు ఇవ్వడం లేదని పేర్కొన్నారు. సమ్మర్ అలవెన్సులు అమలు కావడం లేదని తెలిపారు. గ్రామపంచాయతీల నుండి మంచినీరు అందించడం లేదని పేర్కొన్నారు. అనేక గ్రామాల్లో ఫీల్డ్ అసిస్టెంట్లు లేరని తెలిపారు. ఖాళీగా ఉన్న ఫీల్ అసిస్టెంట్ల స్థానాలను సీనియర్లతో భర్తీ చేయాలని పేర్కొన్నారు. వాచర్ సీనియర్ మేట్లకు ప్రత్యేక పనిని దినాలు కల్పించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం పట్టణ ప్రాంతాల పేదలకు ఉపాధి పని విస్తరింప జెసి 150 రోజులు పని దినాలు కల్పించాలనీ, రోజు కూలి రూ 400 అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు.



లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తున్న మంత్రి అడ్లూరి

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

- మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్లుఅందేలా చూస్తామని ఎస్‌సి, ఎస్‌టి, మైనార్టీ, వికలాంగుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తెలిపారు. జగిత్యాల జిల్లా ధర్మపురి నియోజకవర్గ కేంద్రంలో పురపాలక సంఘం కార్యాలయం ఆవరణలో శనివారం ఇందిరమ్మ ఇళ్ల పట్టాల పంపిణీ చేశారు. ముందుగా ధర్మపురి శ్రీ లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మండలంలోని పలు గ్రామాలకు చెందిన 699 మంది లబ్ధిదారులకు జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్‌తో కలిసి ప్రొసీడింగ్ కాపీలను పంపిణీ చేశారు. ఆ తర్వాత ధర్మపురిలోని శ్రీలక్ష్మీనరసింహ కాలనీలో మొదటి ఇందిరమ్మ ఇంటికి భూమిపూజ చేశారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా పేదల సొంత ఇంటి కలను నెరవేర్చాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తోందని తెలిపారు. ఇండ్లు కట్టుకునే పేదలకు ప్రభుత్వమే ఉచితంగా ఇసుకను సరఫరా చేస్తుందన్నారు. సకాలంలో ఇంటి నిర్మాణం చేపట్టి సొంత ఇంటి కలను సాకారం చేసుకోవాలని సూచించారు. ఇప్పటికే నియోజకవర్గం లోని ప్రతి మండలంలో ఒక్కో గ్రామాన్ని పైలెట్ ప్రాజెక్టుగా తీసుకొని నిర్మాణాలు ప్రారంభించామని చెప్పారు. అధికారులు విచారణ జరిపి నగదును నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోకి చేరేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఇంకా ఎవరైనా అర్హత ఉండి ఇల్లు రాని వారు ఉంటే తనను నేరుగా సంప్రదించొచ్చని తెలిపారు.

మూడోసారీ పాత పాటే

- కొన్ని ప్రశ్నలకు మినహా నోరు మెదపని మాజీ ఐజీ ప్రభాకర్‌రావు
- 17న తిరిగి విచారణకు రమ్మని సిట్ హుకుం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో సంచలనం రేపిన ఫోన్‌ట్యాపింగ్ కేసులో మూడోసారి సిట్ విచారణలో సైతం ఎస్ఐబీ మాజీ ఐజీ ప్రభాకర్‌రావు పాత పాటే పాడినట్టు తెలుస్తోంది. శనివారం ఉదయం 11.15 గంటల నుంచి రాత్రి 8.30 వరకు ఒక గంట భోజన విరామం మినహా సుదీర్ఘంగా స్పెషల్‌టీం అధికారులు ప్రభాకర్‌రావును విచారించారు. మొదటి, రెండోసారి విచారణలో ఏ విధమైన సమాధానాల వ్యవహారం నడిచిందో.. మూడోసారి కూడా ప్రభాకర్‌రావు అదే విధానాన్ని అనుసరించినట్టు సమాచారం. ముఖ్యంగా, తాను ఎస్ఐబీ చీఫ్‌గా ఉన్న సమయంలో తన కింద పని చేసిన డీఎస్పీ ప్రణీత్‌రావుకు ఫోన్‌ట్యాపింగ్‌లను జరపాలంటూ తాను ఎలాంటి ఆదేశాలూ ఇవ్వలేదని మరోసారి ఆయన స్పష్టం చేసినట్టు తెలిసింది. అయితే, మీరు ఆదేశిస్తేనే ఎస్ఐబీ కార్యాలయంలో ఫోన్‌ట్యాపింగ్‌కు సంబంధించిన సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన పరికరాలను ఏర్పాటు చేసుకున్నట్టు ప్రణీత్‌రావు శుక్రవారం తనను విచారించిన సమయంలో వెల్లడించడాన్ని సిట్ అధికారులు మాజీ ఐజీ దృష్టికి తీసుకురాగా.. అందుకు ఆయన మౌనం వహించినట్టు సమాచారం. పలు సందర్భాల్లో కొన్ని ఫోన్ నెంబర్లను పంపించి, వాటిని ట్యాప్ చేయాలని ప్రణీత్‌రావును మీరు ఆదేశించారు కదా అని దృష్టికి తీసుకురాగా.. ప్రభాకర్‌రావు నుంచి పొంతనలేని సమాధానాలు వచ్చినట్టు తెలిసింది. చివరికి అదనపు ఎస్పీలు తిరుపతన్న, బుజంగరావు, నగర టాస్క్‌ఫోర్స్ మాజీ డీజీపీ రాధాకిషన్‌రావులు ప్రభాకర్‌రావు ఆదేశంతోనే తాము ఫోన్‌ట్యాపింగ్‌లకు పాల్పడినట్టు ఇచ్చిన వాంగ్మూలాన్ని సిట్ అధికారులు ఆయనకు చూపించగా.. దాని పైన ఆయన నేరుగా సమాధానమివ్వలేదని సమాచారం. మొత్తమ్మీద, దాదాపు తొమ్మిది గంటలపాటు సాగిన విచారణలో సిట్ అధికారుల ఓపికను ప్రభాకర్‌రావు పరీక్షించినట్టు తెలిసింది. దీంతో సిట్ అధికారులు విచారణను ముగించి తిరిగి ఈనెల 17న విచారణకు హాజరు కావాలని ఆదేశించారు. ఈ లోపల ఇదివరకు తాము ప్రశ్నించిన అధికారులు తిరుపతన్న, బుజంగరావు, రాధాకిషన్‌రావులను సిట్ అధికారులు మరోసారి విచారించే అధికారమున్నదని తెలుస్తోంది.

మామిడి పండ్ల లారీ బోల్తా

- పండ్ల కోసం సంచులు, బుట్టలతో ఎగబడ్డ జనం
- రంగారెడ్డి జిల్లా తిమ్మాపూర్ వద్ద ఘటన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మామిడి పండ్ల లోడ్‌తో వెళ్తున్న లారీ బోల్తా పడింది. ఓవైపు భారీగా ట్రాఫిక్ జామ్ కాగా.. మరోవైపు జనం పండ్ల కోసం ఎగబడ్డారు. ఈ ఘటన రంగారెడ్డి జిల్లా కొత్తూరు మున్సిపాలిటీ పరిధిలో శనివారం జరిగింది. ఈ ఘటనలో గాయాలతో రోడ్డుపై పడిపోయిన డ్రైవర్‌కు సహాయం చేయాల్సింది పోయి.. ప్రజలు మానవత్వం మరిచి మామిడి పండ్ల కోసం ఎగపడ్డారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... షాద్‌నగర్ నుంచి హైదరాబాద్‌కు మామిడి పండ్లతో బయలుదేరిన లారీ ఓవర్ స్పీడ్‌తో అదుపుతప్పి కొత్తూరు మున్సిపాలిటీ పరిధిలోని తిమ్మాపూర్ వద్ద బోల్తా పడింది. దాంతో జాతీయ రహదారి-44పై భారీగా ట్రాఫిక్ జామ్ అయింది. వాహనాలు మూడు కిలోమీటర్ల మేర నిలిచిపోయాయి. స్థానికుల సమాచారంతో ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు క్రేన్ సాయంతో లారీని తొలగించారు. లారీ బోల్తా పడిందని తెలియగానే.. సమీపంలోని ప్రజలు పెద్ద సంఖ్యలో ఘటనా స్థలానికి చేరుకున్నారు. పండ్ల కోసం ఎగబడ్డారు. గాయాలతో ఇబ్బంది పడుతున్న డ్రైవర్‌ను కనీసం పట్టించుకోకుండా.. పండ్లను సంచుల్లో, బుట్టల్లో నింపుకొని తీసుకెళ్లారు.

హైదరాబాద్ సమీపంలో బొగ్గు విక్రయ కేంద్రం

- చిన్న తరహా పరిశ్రమల సౌకర్యం కోసం ఏర్పాటు
- సింగరేణి సిఎండి ఎన్ బలరాం వెల్లడి



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

చిన్న తరహా పరిశ్రమల సౌకర్యం కోసం హైదరాబాద్ సమీపంలో బొగ్గు విక్రయ కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు యోచిస్తున్నామని సింగరేణి సిఎండి ఎన్ బలరాం వెల్లడించారు. ఆయా పరిశ్రమల వారు తమకు కావలసిన తక్కువ మోతాదు బొగ్గును సింగరేణి ఏరియాలకు వచ్చి తీసుకెళ్లడం వెసులుబాటుటా లేదని గమనించామనీ, అందువల్ల హైదరాబాదుకు సమీపంలో ఒక బొగ్గు విక్రయ కేంద్రాన్ని ఏర్పాటు చేయడానికి ఉన్న అవకాశాలను పరిశీలించాలని అధికారులని ఆదేశించారు. శనివారంనాడిక్కడి సింగరేణి భవన్ నుంచి అన్ని ఏరియాల జనరల్ మేనేజర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. వినియోగదారులకు నాణ్యమైన బొగ్గు అందించడం కోసం ఇకపై సింగరేణి సంస్థ నుండి జీ-14, జీ-15 గ్రేడ్‌ల బొగ్గు రవాణాను పూర్తిగా నిలిపివేయాలని చెప్పారు. దానికి బదులు జీ-13 గ్రేడ్ బొగ్గును సరఫరా చేసేందుకు ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. భూపాలపల్లి ఏరియాలోని భూగర్భ గనుల్లో మట్టి నింపేందుకు గోదావరి నది నుంచి ఇసుక సేకరణకు అవసరమైన క్వారీ అనుమతులు తీసుకోవాలని ఆదేశించారు. సింగరేణి వ్యాప్తంగా నిర్వహిస్తున్న 'నీటి బిందువు జల సింధువు' కార్యక్రమం ద్వారా 60 చెరువుల నిర్మాణాలు పూర్తయ్యాయని, మరో 43 చెరువుల్లో పూడికతీత పనులు వివిధ దశల్లో ఉన్నాయన్నారు. అలాగే 'ప్రతి అడుగు పచ్చదనం వైపు' కార్యక్రమం ద్వారా ఈ ఏడాది సింగరేణి వ్యాప్తంగా 675 హెక్టార్లలో 45 లక్షల మొక్కలు నాటేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్లు డి సత్యనారాయణరావు, ఎల్‌వి సూర్యనారాయణ, కె వెంకటేశ్వర్లు, కోల్ మూమెంట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎస్‌డిఎం సుభాని తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సోమయ్య

పెండింగ్ బిల్లులు మంజూరు చేయాలి

- డిటిఎఫ్ డిమాండ్

ప్రజాశక్తి -హైదరాబాద్‌బ్యూరో

రాష్ట్రంలోని ఉద్యోగులు, ఉపాధ్యాయులకు సంబంధించిన పెండింగ్ బిల్లులు ఏండ్ల తరబడి పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని వెంటనే మంజూరు చేయాలని డిటిఎఫ్ రాష్ట్ర కార్యవర్గం ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. శనివారం హైదరాబాద్‌లో ఆ సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం డిటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎం సోమయ్య, ప్రధాన కార్యదర్శి టి లింగారెడ్డి మాట్లాడారు. గతేడాది ఏప్రిల్ నుంచి ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగులు, ఉపాధ్యాయులకు ఇప్పటి వరకు పెన్షన్ సౌకర్యాలు అందడం లేదని తెలిపారు. నెలకు రూ.700 కోట్లు విడుదల చేస్తామంటూ ప్రభుత్వం హామీ ఇచ్చినా నెరవేరడం ఆందోళన వ్యక్తం చేశారు. పీఆర్సీ అమలు గడువు ముగిసి దాదాపు రెండేళ్లు అయినప్పటికీ అమలు చేయకుండా ప్రభుత్వం తాత్సారం చేస్తున్నదని విమర్శించారు. రాష్ట్రంలో 33 జిల్లాలుంటే 12 జిల్లాల్లోనే డిఇఒ పోస్టులున్నాయనీ, అందులో నాలుగు జిల్లాలకే రెగ్యులర్ డిఇఒలున్నారని వివరించారు. మిగతా 27 జిల్లాల్లో ఇన్‌చార్జీ డిఇఒలు పనిచేస్తున్నారని తెలిపారు. 21 జిల్లాలకు డిఇఒ పోస్టులే లేవని పేర్కొన్నారు. డిఇఒ పోస్టులను మంజూరు చేసి పదోన్నతుల ద్వారా భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయుల సర్దుబాటుకు సంబంధించి అశాస్త్రీయతను పరిశీలించాలని కోరారు. ప్రాథమిక స్థాయిలో 60 మంది పిల్లలకు ఇద్దరు టీచర్లు ఉండాలనడం సరైంది కాదని తెలిపారు. ఆ ఉత్తర్వులను సవరించాలని పేర్కొన్నారు. సర్వీసు రూల్స్ సమస్యను పరిష్కరించాలని కోరారు. అపరిష్కృతంగా ఉన్న కెజిబివి, మోడల్ స్కూల్, ఐటిడిఎ, గురుకుల ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని తెలిపారు.

ఈసెట్ కౌన్సెలింగ్ ప్రారంభం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో బిటెక్, బిఇ, బి ఫార్మసీ, బిఎస్‌సి మ్యాథమెటిక్స్ కోర్సుల్లో ద్వితీయ సంవత్సరంలో లాటరల్ ఎంట్రీ ద్వారా 2025-26 విద్యాసంవత్సరానికి సంబంధించిన ప్రవేశాల కోసం నిర్వహించిన ఈసెట్ కౌన్సెలింగ్ ప్రక్రియ శనివారం ప్రారంభమైంది. ఈ మేరకు సాంకేతిక విద్యాశాఖ కమిషనర్, ఈసెట్ ప్రవేశాల కన్వీనర్ ఎ శ్రీదేవసేన శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. శనివారం నుంచి 18 వరకు ఆన్‌లైన్‌లో ప్రాథమిక సమాచారం అందుబాటులో ఉంటుందనీ, ప్రాసెసింగ్ ఫీజు చెల్లించాలనీ, ధ్రువపత్రాల పరిశీలనకు స్లాట్ బుక్ చేసుకోవాలని కోరారు. మొదటిరోజు 3,293 మంది ధ్రువపత్రాల పరిశీలన కోసం స్లాట్ బుక్ చేసుకున్నారని వివరించారు. ఈనెల 17 నుంచి 19 వరకు ధ్రువపత్రాల పరిశీలన జరుగుతుందని తెలిపారు. అదేనెల 17 నుంచి 21 వరకు వెబ్‌ఆప్షన్లు నమోదు చేసేందుకు అవకాశముంటుందని పేర్కొన్నారు. ఈ నెల 25న తొలివిడత సీట్లు కేటాయిస్తామని వివరించారు. పూర్తి వివరాలకు https://tgecet.nic.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

నీట్‌లో శ్రీగోసలైట్స్ మెడికల్ అకాడమీ విద్యార్థుల విజయం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నీట్-2025 ఫలితాల్లో శ్రీగోసలైట్స్ మెడికల్ అకాడమీ విద్యార్థులు అద్భుతమైన ఫలితాలతో చరిత్ర సృష్టించింది. ఈ ఏడాది నీట్ పరీక్ష కఠినంగా ఉన్నప్పటికీ, పరీక్షా విధానం మారినప్పటికీ, నిర్దిష్టమైన ప్రణాళికతో ప్రోగ్రామ్స్ డిజైన్ చేసి, నిజాయితీగా ప్రయత్నం చేయడం ద్వారా అత్యుత్తమ ఫలితాలు సాధించొచ్చని శ్రీగోసలైట్స్ నిరూపించింది. ఈ మేరకు శ్రీ గోసలైట్స్ చైర్మన్ నరేంద్రబాబు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఉత్తమ ర్యాంకులు సాధించిన తమ సంస్థలో చదివిన విద్యార్థులకు ఆయన అభినందనలు తెలిపారు. '720 మార్కులకు 600 పైన మార్కులు సాధించిన విద్యార్థులు 11 మంది, 550 పైన మార్కులు సాధించిన విద్యార్థులు 69 మంది, 500 పైన మార్కులు సాధించిన విద్యార్థులు 379 మంది, 470 పైన మార్కులు సాధించిన విద్యార్థులు 814 మంది, 450 పైన మార్కులు సాధించిన విద్యార్థులు 1,086 మంది విద్యార్థులున్నారని వివరించారు. నీట్-25 ఫలితాల్లో 1,500 మందికి పైగా శ్రీ గోసలైట్స్ విద్యార్థులు దేశ వ్యాప్తంగా ఉచిత మెడికల్ సీట్లు సాధించారని తెలిపారు.

కెటిఆర్‌పై కేసు నమోదు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌పై హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలపై చేశారంటూ కాంగ్రెస్ ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ రెండ్రోజుల కిందట ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా కేటీఆర్ చేసిన వ్యాఖ్యలు, అలాగే సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన వీడియోలను సైబర్ క్రైమ్ పోలీసులకు అందజేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పట్ల కేటీఆర్ మాట్లాడిన మాటలు అవమానకరంగా

గరీబోళ్ల జాగ.. ప్రభుత్వాల పగ

- ఇళ్ల స్థలాలు వెనక్కు తీసుకునేందుకు కుట్ర
- గ్రీన్‌ఫీల్డ్ హైవే.. యంగ్ ఇండియా స్కూల్ పేరుతో వెనక్కి!
- 3 వేల మందికి పైగా జీవితాలతో చెలగాటం
- పేదల స్థలాల జోలికొస్తే ఊరుకోం: సిపిఎం



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గరీబోళ్ల జీవితాలతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెలగాటమాడుతున్నాయి. నాడు అభయ 'హస్తం' ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం నేడు రిక్త'హస్తం' చూపుతోంది. పేదలకు ఇచ్చిన స్థలాలను గ్రీన్‌ఫీల్డ్ హైవే, యంగ్ ఇండియా స్కూల్ పేరుతో వెనక్కు తీసుకోవాలనే యోచనతో ఉంది. ఈ నేపథ్యంలో పేదల పక్షాన 'సుత్తీ కొడవలి చుక్క' వేగుచుక్కై పోరాడుతోంది.

ఇండ్ల స్థలాల కోసం సిపిఎం సాగించిన పోరాటాల ఫలితంగా అనేక ప్రాంతాల్లో నిరుపేదలకు జాగాలు వచ్చాయి. ఖమ్మం నగరంలో వైఎస్‌ఆర్ కాలనీ, శివాయిగూడెం, రఘునాథపాలెం మండల కేంద్రాల్లో పేదల కాలనీలు ఏర్పాటయ్యాయి. 2009లో వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రభుత్వ హయాంలో రఘునాథపాలెం రెవెన్యూ 218 సర్వే నంబర్‌లో 2వేల మందికి ఒక్కొక్కరికీ 75 గజాల చొప్పున ఇండ్ల స్థలాల పట్టాలు ఇచ్చారు. 2018లో రీ సర్వే చేసి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పేరుతో ఉన్న ఈ పట్టాలను మార్చి లబ్ధిదారులను కుదించారు. తెలంగాణ ప్రభుత్వం పేరుతో 725 మందికి మాత్రమే పట్టాలు ఇచ్చారు. అదే స్థలంలో ఇండ్లు నిర్మించుకునేందుకు కేసీఆర్ ఇంటి నిర్మాణం పేరుతో రూ.మూడు లక్షలు ఇస్తామన్నారు. కొందరికి ఇంటి నిర్మాణానికి కావాల్సిన నగదు మంజూరు పత్రాలూ జారీ చేశారు. తదనంతరం అధికారంలోకొచ్చిన కాంగ్రెస్.. పరిహారం లేకుండా ఈ స్థలాలను బై బ్యాక్ చేసుకునేందుకు పూనుకుంది. ఇదే జరిగితే ఇప్పటికే ఈ ప్లాట్లపై ఒక్కొక్కరూ రూ.లక్షకు పైగా వెచ్చించి చేపట్టిన నిర్మాణాలతోపాటు స్థలాలను కోల్పోతారు. మూడు వేల మందికి పైగా నిరుపేదల జీవితాలు రోడ్డున పడతాయి.

కాజేతకు కుట్ర

నాగపూర్ టూ అమరావతి గ్రీన్‌ఫీల్డ్ హైవే అలైన్‌మెంట్ పేదల స్థలం నుంచి పోతోంది. దీని కింద 261 మందికి చెందిన ఇండ్ల ప్లాట్లు పోతున్నాయి. అది పోగా మిగిలిన ప్లాట్లలోనైనా ఇండ్లు నిర్మించుకుందామంటే.. రాష్ట్ర ప్రభుత్వం యంగ్ ఇండియా సమీకృత పాఠశాల కోసం 30 ఎకరాలు కేటాయించిందని.. స్థలం వెనక్కు తీసుకున్నామని అధికారులు చెబుతున్నారు. ఇప్పటికే అనేక మంది పునాదులు తీసుకున్నారు. బేస్‌మెంట్ లెవల్లో కొన్ని ఇండ్లు ఉన్నాయి. ఒక్కొక్కరూ రూ.లక్షకు పైగా ఖర్చు పెట్టారు. ఇప్పుడా స్థలాలను ఖాళీ చేయాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు రావటం.. ఇండ్ల నిర్మాణాన్ని ఆటంకం పరుస్తుండటంతో స్థానికులు ఆవేదన చెందుతున్నారు. ఇంటి నిర్మాణ అనుమతి తెచ్చుకొని నిర్మించుకోవాలంటున్న అధికారులు.. పర్మీషన్ కోసం పోతే 'పొమ్మన లేక పొగబెట్టినట్టూ..' కార్యాలయాల చుట్టూ తిప్పించుకుంటున్నారు. తగిన పరిహారం ఇవ్వాలని.. లేదంటే ప్రత్యామ్నాయ స్థలాన్ని చూపాలని మంత్రులు భట్టి విక్రమార్క, తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డికి బాధితులు మొరపెట్టుకున్నారు. నేషనల్ హైవే అథారిటీ అధికారులకు అర్జీలు పెట్టారు. కలెక్టర్, ఆర్డీవో, తహశీల్దార్లకు వినతిపత్రాలు ఇచ్చారు. కానీ ఎవరూ వీరి గోడు వినే పరిస్థితి లేకపోవడంతో సీపీఐ(ఎం) అండగా నిలబడింది. అఖిలపక్షంతో కలిసి రౌండ్ టేబుల్ సమావేశంతో మొదలైన ఈ ఆందోళనను మరింత తీవ్రం అవుతోంది.

ఇంటి అనుమతి ఇవ్వట్లేదు : గోగుల రేణుక, బాధితురాలు

అనుమతి తెచ్చుకొని ఇల్లు కట్టుకోవాలంటున్నారు. ఆర్డీవో పర్మీషన్ ఇవ్వట్లేదు. పట్టాలు ఇచ్చి ఏడేళ్లయినా ప్రభుత్వం మౌలిక సౌకర్యాలు ఏమీ కల్పించలేదు. మాకు ఎక్కడా సొంత ఇళ్లు కూడా లేవు. అద్దెకు ఉంటున్నాం. పైసా పైసా కూడబెట్టి ఇల్లు కట్టుకుందామంటే అనుమతి ఇవ్వట్లేదు. ఇప్పటికే బేస్‌మెట్ వరకు నిర్మించాం. రూ.లక్షకు పైగా ఖర్చు వచ్చింది. ప్రభుత్వాలే ఇలా మాతో ఆడుకుంటే మా గోడు ఎవరికి చెప్పుకోవాలి.

కనికరం లేకుండా ఉన్నారు : సంగెపు చంద్రకళ, బాధితురాలు

కనీస సౌకర్యాలు కల్పించటం లేదు. రూ.వేలల్లో అద్దెలు చెల్లించలేక పోతున్నాం. ఇచ్చిన 75 గజాల్లో ఇంటి నిర్మాణం చేద్దామంటే నీరు, కరెంట్, రోడ్డు వంటి సౌకర్యాలు ఏవీ కల్పించకుండా మమ్మల్ని ఈ స్థలాల నుంచి వెళ్లగొట్టే ప్రయత్నం చేస్తున్నారు. బేస్‌మెంట్, గోడలు కట్టాం.. ఇప్పుడు ఖాళీ చేయమంటే మేము ఎక్కడికి వెళ్లాలి.

పేదల స్థలాల జోలికొస్తే ఊరుకోం..

ఎస్.నవీన్‌రెడ్డి, సిపిఎం రఘునాథపాలెం మండల కార్యదర్శి

పేదల స్థలాల జోలికొస్తే ఊరుకోం. ఎంతటి పోరాటానికైనా వెనుకాడం. ఇప్పటికే మా పార్టీ ఆధ్వర్యంలో పోరాటం మొదలుపెట్టాం. అఖిలపక్షాల రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించాం. పార్టీ జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, ఖమ్మం డివిజన్ కార్యదర్శి వై విక్రమ్‌తో కలిసి భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తున్నాం. త్వరలో కలెక్టరేట్‌ను ముట్టడిస్తాం.

రేపు ఇంటర్ సప్లిమెంటరీ ఫలితాలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫలితాలు సోమవారం మధ్యాహ్నం 12 గంటలకు విడుదల కానున్నాయి. ఈ మేరకు ఇంటర్ బోర్డు కార్యదర్శి కృష్ణఆదిత్య శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ ఫలితాలను ఆన్‌లైన్ ద్వారా విడుదల చేస్తామని తెలిపారు. ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం ఒకేషనల్, జనరల్ విద్యార్థుల ఫలితాలను ప్రకటిస్తామని పేర్కొన్నారు. విద్యార్థులు ఫలితాల కోసం https://tgbie.cgg.gov.in, http:// results.cgg.gov.in వెబ్‌సైట్లను సంప్రదించాలని కోరారు. గతనెల 22 నుంచి 29 వరకు ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలను నిర్వహించిన విషయం తెలిసిందే. రాష్ట్రవ్యాప్తంగా ఈ పరీక్షలకు 4,13,597 మంది విద్యార్థులు హాజరయ్యారు. గతనెల 29 నుంచి ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల జవాబు పత్రాల మూల్యాంకనం ప్రక్రియ ప్రారంభమైంది. ఈనెల ఒకటో తేదీ వరకు ఈ ప్రక్రియ కొనసాగింది. ప్రాసెస్ పూర్తయినందున సోమవారం ఈ ఫలితాలను విడుదల చేయాలని ఇంటర్ బోర్డు నిర్ణయించింది.

రెండో రోజూ ఎఐజి ఆస్పత్రికి కెసిఆర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బిఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ శనివారం కూడా రంగారెడ్డి జిల్లా గచ్చిబౌలిలోని ఏఐజీ ఆస్పత్రికి వచ్చారు. సాధారణ వైద్య పరీక్షలు చేయించుకుని వెళ్లారు. శుక్రవారం ఆస్పత్రికి రాగా, మళ్లీ రెండో రోజు కూడా వచ్చారు. మొదటి రోజు కొన్ని పరీక్షలు చేసిన వైద్యులు, రెండో రోజు మరికొన్ని పరీక్షలు చేసినట్టు ఆస్పత్రి సిబ్బంది తెలిపింది. ఈ సందర్భంగా ఆరోగ్యంపై కెసిఆర్‌కు పలు సలహాలు, సూచనలు చేశారు. కెసిఆర్ తరచుగా తమ ఆస్పత్రికి వస్తారని ఆస్పత్రి యాజమాన్యం తెలిపింది.

తాగునీటి సమస్యను తీర్చాలి

ఖాళీ బిందెలతో రహదారిపై జనం నిరసన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తాగునీటి సమస్యను పరిష్కరించాలని కామారెడ్డి జిల్లా మహమ్మద్‌నగర్ మండల కేంద్రంలో బుడగ జంగాల కాలనీ వాసులు డిమాండ్ చేశారు. వారం రోజులుగా తాగునీటి ఇబ్బందులు తలెత్తడంతో కాలనీవాసులు శనివారం బోధన్ హైదరాబాద్ ప్రధాన రహదారిపై ఖాళీ బిందెలతో బైటాయించి నిరసన తెలిపారు. వారం రోజులుగా కాలనీలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని, సంబంధిత శాఖ అధికారులకు పలుమార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆందోళనతో రోడ్డుపై ఇరువైపులా పెద్దఎత్తున వాహనాలు నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న నిజాంసాగర్ ఎస్ఐ శివకుమార్ అక్కడికి చేరుకొని మహిళలను సముదాయించారు. గ్రామ పంచాయతీ అధికారులతో మాట్లాడి తాగునీటి ఇబ్బందులు లేకుండా చేస్తామని హామీనివ్వడంతో వారు ఆందోళన విరమించారు.

కాళేశ్వరంపై కెసిఆర్ చెప్పినవన్నీ కాకమ్మ కథలే

- ఎన్‌విఎస్ఎస్ ప్రభాకర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం నుంచి పదేళ్ల బిఆర్ఎస్ సర్కార్ పాలనలో జరిగిన అవినీతిని కాంగ్రెస్ ప్రభుత్వం బయటపెట్టాలని బికెజెపి మాజీ ఎమ్మెల్యే ఎన్‌విఎస్ఎస్ ప్రభాకర్ డిమాండ్ చేశారు. కాళేశ్వరం కమిషన్ ఎదుట మాజీ సిఎం కెసిఆర్ చెప్పినవన్నీ కాకమ్మ కథలేననీ, వాటిలో ఎలాంటి విశ్వసనీయత లేదన్నారు. అన్నీ తానై వ్యవహరించి, కాళేశ్వరం ప్రాజెక్ట్ నిర్మాణం మంత్రివర్గ నిర్ణయం మేరకే జరిగిందని చెప్పారని, ఇంతకంటే విడ్డూరం ఇంకేముందన్నారు. రాజకీయకారణాలతోనే అంచనాలు పెంచి తమ్మిడిహట్టి నుంచి ప్రాజెక్ట్ లొకేషన్‌ను మార్చారనీ, దీనిపై జస్టిస్ ఘోష్ కమిషన్ వాస్తవాలు రాబట్టాలని కోరారు.

ఇజ్రాయెల్ మారణహోమాన్ని ఆపాలి



సమావేశంలో మాట్లాడుతున్న జాన్ వెస్లీ

- 19న పాలస్తీనా సంఘీభావ దినాన్ని జయప్రదం చేయాలి
- వామపక్ష పార్టీలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గత 20 నెలలుగా గాజాలో పాలస్తీనా ప్రజలపై ఇజ్రాయెల్ నిరంతర బాంబు, వైమానిక దాడులకు పాల్పడుతున్నదని వామపక్ష పార్టీలు విమర్శించాయి. అక్కడ మారణహోమాన్ని సృష్టిస్తూ యుద్ధానికి పూనుకున్నదని తెలిపాయి. ఇప్పటికే దాదాపు 50 వేల మంది మరణించారని ఆందోళన వ్యక్తం చేశాయి. ఇజ్రాయెల్ చేస్తున్న మారణహోమాన్ని, యుద్ధాన్ని వెంటనే ఆపాలని డిమాండ్ చేశారు. శనివారం హైదరాబాద్‌లోని సిపిఎం రాష్ట్ర కార్యాలయం ఎంబి భవన్‌లో వామపక్ష పార్టీల సమావేశం సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పశ్య పద్మ (సిపిఐ), జూలకంటి రంగారెడ్డి (సిపిఎం), వేములపల్లి వెంకట్రామయ్య, గోవర్దన్ (సిపిఐ(ఎంఎల్) న్యూడెమొక్రసీ), రమేష్‌రాజా (సిపిఐ(ఎంఎల్) లిబరేషన్), సిహెచ్ మురహరి (ఎస్‌యుసిఐ(సి)) తదితరులు పాల్గొన్నారు. అనంతరం వారు సంయుక్తంగా ఒక ప్రకటన విడుదల చేశారు. గాజాలో మౌలిక సదుపాయాలు, ఆస్పత్రులు, పాఠశాలలు, మహిళలు, పిల్లలు, శరణార్థుల ఆశ్రయాలను లక్ష్యంగా చేసుకుని ఇజ్రాయెల్ వేలాదిమందిని పొట్టన పెట్టుకుంటున్నదని విమర్శించారు. కనీసం ఆహారాన్ని అందించడానికి కూడా ఆటంకాలు కల్పిస్తున్నదని తెలిపారు. ఐక్యరాజ్య సమితితోపాటు, ప్రపంచవ్యాప్తంగా ఈ దుశ్చర్యను వ్యతిరేకిస్తున్నా, అమెరికా దాని కొన్ని మిత్రదేశాల మద్దతుతో ఇది కొనసాగిస్తున్నదని పేర్కొన్నారు. ఇటీవల ఇరాన్‌పై కూడా యుద్ధాన్ని ప్రకటించి బీభత్సం సృష్టిస్తున్నదని తెలిపారు. అంతర్జాతీయ చట్టం, మానవహక్కులను కాలరాస్తున్నదని విమర్శించారు. ఈ దురహంకార మారణహోమ యుద్ధాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని పేర్కొన్నారు. భారత ప్రభుత్వం పాలస్తీనా ప్రజలకు అండగా నిలవాలనీ, ఇజ్రాయెల్‌తో అన్ని సైనిక, భద్రతా సహకారాన్ని వెంటనే నిలిపేయాలని డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో పాలస్తీనాకు సంఘీభావంగా కార్యక్రమాలు నిర్వహించాలని అఖిలభారత వామపక్ష పార్టీలు పిలుపునిచ్చాయని గుర్తు చేశారు. వామపక్ష పార్టీలు, ప్రపంచశాంతిని కోరుకునే ప్రజాస్వామ్య, లౌకిక శక్తుల పిలుపు మేరకు దేశవ్యాప్తంగా ఈనెల 19న రాష్ట్రవ్యాప్తంగా సంఘీభావంగా అన్ని జిల్లా కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజలు, ప్రజాతంత్రవాదులు పెద్దఎత్తున పాల్గొని మద్దతు తెలియజేయాలని వారు విజ్ఞప్తి చేశారు.

మొర ఆలకించని మోడీ

- మూసీ సుందరీకరణ, జల్‌జీవన్ మిషన్, పౌర సరఫరాల శాఖ పెండింగ్ నిధులు, వరద సాయంపై కేంద్రం మీనమేషాలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

'మా మొర ఆలకించండి మహాప్రభో.. ఆర్థికంగా సాయం చేసి ఆదుకోండి సారో...' అంటూ రాష్ట్ర ప్రభుత్వం ఎంతగా వేడుకున్నా కేంద్రంలోని మోడీ సర్కారు చెవికెక్కటం లేదు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటిదాకా 18 నెలల కాలంలో ముఖ్యమంత్రి రేవంత్ 45 సార్లు ఢిల్లీకి వెళ్లొచ్చారు. హస్తినకు వెళ్లిన ప్రతీసారీ ప్రధాని మోడీనీ, హోం మంత్రి అమిత్‌షానూ, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ను కలుస్తున్నారు. వారికి విజ్ఞప్తుల మీద విజ్ఞప్తులు చేస్తున్నారు. పలు అంశాలపై వినతిపత్రాలు సమర్పిస్తున్నారు. కానీ అక్కడి నుంచి చిల్లిగవ్వ కూడా రాష్ట్రానికి రాలేదు. కాంగ్రెస్ అంతర్గత వ్యవహారాల్లో భాగంగా తమ పార్టీ అధిష్టానం వద్దకు సీఎం వెళుతున్నా.. అలా వెళ్లిన ప్రతీసారి కేంద్ర ప్రభుత్వ పెద్దలను సైతం కచ్చితంగా కలిసొస్తున్నారు. సింగరేణికి కోల్ బ్లాకులు కేటాయించేందుకు రూ.1.63 లక్షల కోట్లు కావాలంటూ సిఎం రేవంత్ గతేడాది డిసెంబరులో కేంద్రాన్ని కోరారు. ఇదే అంశంపై ఆయన ఢిల్లీలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డితోపాటు మరికొందరు అమాత్యులతో భేటీ అయ్యారు. మూసీ ప్రక్షాళనకు సంబంధించి 'మూసీ సుందరీకరణ ప్రాజెక్టు' కోసం రూ. పది వేల కోట్ల మేర సాయం చేయాలంటూ ప్రధానికి ఆయన విజ్ఞప్తి చేశారు. జల్ జీవన్ మిషన్‌లో భాగంగా ఈ సాయం చేయాలంటూ ఆయన కోరారు. గతేడాది రాష్ట్రంలో భారీ వర్షాలు, వరదలు సంభవించి, పంటలకు అపార నష్టం వాటిల్లిన నేపథ్యంలో... రైతులను ఆదుకునేందుకు వీలుగా రూ.11,713 కోట్లను మంజూరు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రాన్ని కోరింది. హైదరాబాద్ మెట్రో రైల్ విస్తరణ కోసం రూ.17,212 కోట్లతో డీపీఆర్‌ను రూపొందించామని సిఎం... ప్రధాని మోడీకి తెలిపారు. దాన్ని త్వరితగతిన ఆమోదించటంతోపాటు వీలైనన్ని ఎక్కువ నిధులివ్వాలంటూ విజ్ఞప్తి చేశారు. ఇవేగాకుండా పౌర సరఫరాలశాఖకు సంబంధించిన పెండింగ్ నిధులను కూడా (ఎపితో ముడిపడి ఉన్న అంశం) వెంటనే విడుదల చేయాలంటూ ముఖ్యమంత్రి కోరారు. వీటిపై ఇప్పటి వరకూ కేంద్రం స్పందించకపోవటం గమనార్హం. వాటితోపాటు అనేక పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి పరిపాలనా పరమైన అనుమతులు కోరుతూ రాష్ట్ర ప్రభుత్వం తరపున సిఎంతోపాటు డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్, జూపల్లి, కోమటిరెడ్డి, శ్రీధర్‌బాబు తదితరులు ప్రధాని మోడీని, సంబంధిత శాఖల మంత్రులను కలిశారు. ఆర్‌ఆర్‌ఆర్‌కు అనుమతులు, హైదరాబాద్‌లో ఖేలో ఇండియా గేమ్స్ నిర్వహణ, క్రీడా సంస్థల అప్‌గ్రేడేషన్‌కు అనుమతులు, తెలంగాణ-ఎపి మధ్య ఐకానిక్ బ్రిడ్జ్ (సోమశిల-సంగమేశ్వర మధ్య) నిర్మాణ పనులకు అనుమతి, రాష్ట్ర పర్యాటకాభివృద్ధికి సాయం, రాష్ట్రానికి కేటాయించిన ఐపిఎస్ అధికారుల సంఖ్య పెంపు, పునర్ విభజన సమస్యలకు పరిష్కారం, గౌరవెల్లి ప్రాజెక్టుకు సంబంధించి అటవీ, పర్యావరణ అనుమతులు తదితరాంశాలు వీటిలో కీలకంగా ఉన్నాయి.

హరీశ్‌రావు వాదనలు నిరాధారం

- మంత్రి ఉత్తమ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్మించ తలపెట్టిన గోదావరి-బనకచర్ల ప్రాజెక్టు విషయంలో తెలంగాణ ప్రభుత్వంపై మాజీ మంత్రి హరీశ్‌రావు చేసిన ఆరోపణలను మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి తోసిపుచ్చారు. "గోదావరి-బనకచర్ల ప్రాజెక్టుపై నిర్ణయాత్మకంగా వ్యవహరిస్తున్నాం. జనవరి 22న కేంద్ర జలశక్తి, ఆర్థికశాఖ మంత్రులకు లేఖ రాశాను. ఆ ప్రాజెక్టుపై అభ్యంతరాలు తెలిపాను. బనకచర్ల ప్రాజెక్టుపై కాంగ్రెస్ పార్టీ మౌనం వహించలేదు. చట్టపరంగా ముందుకెళ్తున్నాం. హరీశ్‌రావు వాదనలు నిరాధారం, తప్పుదారి పట్టించేలా ఉన్నాయి. నదీ జలాల హక్కులపై తెలంగాణకు నష్టం చేసింది బిఆర్ఎస్సే. కృష్ణానది వాటాను కేవలం 299 టిఎంసిలకే పరిమితం చేశారు. బిఆర్ఎస్ హయాంలోనే ముచ్చుమర్రి, మాల్యాల నుంచి నీటిని తరలించారు. రాయలసీమ ఎత్తిపోతలపై అపెక్స్ కౌన్సిల్‌ను మీరెందుకు సంప్రదించలేదు. ఆంధ్రప్రదేశ్..రోజూ మూడు టిఎంసిలు మళ్లిస్తోంటే కెసిఆర్ చోద్యం చూశారు. జగన్, కెసిఆర్ మధ్య అవగాహనతోనే తెలంగాణ నీటిని ఆంధ్రాకు దోచిపెట్టారు" అని ఉత్తమ్ కుమార్‌రెడ్డి ఆరోపించారు.



మంత్రి వివేక్‌కు ఘన స్వాగతం

గజమాలలతో కాంగ్రెస్ నాయకులు, అభిమానుల సన్మానం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కార్మిక, మైనింగ్ శాఖ మంత్రి గడ్డం వివేక్ మొదటిసారి మంచిర్యాల జిల్లా చెన్నూర్ నియోజకవర్గానికి రాగా కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. శనివారం హైదరాబాద్ నుంచి రాజీవ్ రహదారి మీదుగా గోదావరిఖని నుంచి ఇందారం చేరుకున్న మంత్రికి స్థానిక నాయకులు ఘన స్వాగతం పలికారు. మంత్రిగా నియోజకవర్గానికి మొదటిసారి వచ్చిన వివేక్‌కు నాయకులు, అభిమానులు గజమాలలతో ఘనంగా స్వాగతం పలికారు. ఇందారం నుంచి చెన్నూర్ వరకు వాహనాల ర్యాలీ కొనసాగింది. మంత్రి వివేక్‌కి అధికారులు కూడా పుష్పగుచ్ఛాలు, శాలువాలతో సన్మానించారు. మంచిర్యాల డిసిపి భాస్కర్ పర్యవేక్షణలో జైపూర్ ఎసిపి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో శ్రీరాంపూర్ సిఐ వేణుచందర్, జైపూర్ ఎస్ఐ శ్రీధర్, భీమారం ఎస్ఐ శ్వేత భారీ బందోబస్తు ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా ఇందారం ఎక్స్ రోడ్డు వద్ద రోడ్‌షోలో మంత్రి మాట్లాడుతూ.. ఇసుక అక్రమ రవాణా ఆపేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తనకు మైనింగ్ శాఖ ఇచ్చారని, ఇసుక దందాను నిలిపేసి ఎక్కడా అవినీతి, అక్రమాలు లేకుండా అభివృద్ధికి పెద్దపీట వేస్తానని అన్నారు. ఇప్పటికే గ్రామాల వారీగా రూ.50 లక్షలతో అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయన్నారు. గత ప్రభుత్వం డబుల్ బెడ్‌రూం ఇస్తామని చెప్పి ప్రజలను మోసం చేసిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీల పట్ల కట్టుబడి పని చేస్తుందన్నారు.

సిఎంకు పాలనమీద పట్టులేదు: బిజెపి

ప్రజాశక్తి -హైదరాబాద్‌బ్యూరో

ముఖ్యమంత్రి ఎ రేవంత్‌రెడ్డికి పాలనమీద పట్టు లేదని బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ సోలంకి శ్రీనివాస్ విమర్శించారు. శనివారంనాడిక్కడి బిజెపి రాష్ట్ర కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పరిపాలన అంటే కేవలం ఐఎఎస్, ఐపిఎస్ అధికారుల బదిలీలే అనుకుంటున్నారని ఎద్దేవా చేశారు. అధికారుల్ని తరచూ బదిలీలు చేయడం వల్ల పరిపాలనలో అనిశ్చితి ఏర్పడి, అవినీతికి మార్గం ఏర్పడుతుందని చెప్పారు. మూడు నెలలకోసారి అధికారులను మారిస్తే ప్రభుత్వం అస్థిరతలోకి వెళ్తుందన్నారు. ఈ బదిలీల వెనుక అవినీతి కోణాన్ని కూడా చూడాల్సి వస్తుందని అనుమానాలు వ్యక్తం చేశారు. కేంద్రంలో మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పుడు యూపీఏ హయాంలోని అధికారులనే కొనసాగిస్తూ పరిపాలన చేశారని గుర్తుచేశారు.

స్థానిక ఎన్నికలు ఎప్పుడు?

- ఓటమి భయంలో రేవంత్ సర్కార్
- మాజీ ఎంపి బూరనర్సయ్యగౌడ్ విమర్శ

ప్రజాశక్తి-హైదరాబాద్‌బ్యూరో

రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై ప్రభుత్వానికి ఎలాంటి స్పష్టత లేదని బిజెపి మాజీ ఎంపి బూర నర్సయ్యగౌడ్ ఆరోపించారు. శనివారంనాడిక్కడి బిజెపి రాష్ట్ర కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో 12,769 మంది సర్పంచుల పదవీకాలం 2024 జనవరి 31న ముగిసిందనీ, 5,717 మంది ఎంపిటిసిల పదవీకాలం 2024 మే నెలలో ముగిసిందని తెలిపారు. 538 మంది జడ్‌పిటిసిలు, ఎంపిపిలు, జడ్‌పి చైర్‌పర్సన్ల పదవీకాలం పూర్తయ్యి ఏడాది దాటిపోయిందన్నారు. రాష్ట్రంలోని మొత్తం 130 మున్సిపాల్టీల్లో 128 మున్సిపాల్టీల పదవీకాలం పూర్తయ్యి ఆరు నెలలు గడిచినా, ఇప్పటికీ ఎన్నికల ప్రక్రియ ప్రారంభం కాలేదని విమర్శించారు. భారత రాజ్యాంగం ప్రకారం స్థానిక సంస్థల ఎన్నికలు రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆధీనంలో ఉన్నాయనీ, వాటిని సకాలంలో నిర్వహించాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉన్నదని వివరించారు. ఎన్నికలు ఆలస్యం కావడం వల్ల స్థానిక సంస్థలకు సెంట్రల్ ఫైనాన్స్ కమిషన్ ద్వారా రావల్సిన అభివృద్ధి నిధులు నిలిచిపోతాయనీ, ప్రస్తుతం 15వ ఆర్థిక సంఘం ద్వారా రాష్ట్రానికి రావల్సిన రూ.1,514 కోట్లు, 14వ ఆర్థిక సంఘం నుంచి రావల్సిన రూ.800 కోట్ల బకాయిలు ఆగిపోయాయని తెలిపారు. పాలనలో రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యానికి ఇది ప్రత్యక్ష ఉదాహరణ అని విమర్శించారు. స్థానిక సమరంలో కాంగ్రెస్‌పార్టీ ఓటమి పాలవుతుందన్న భయంతోనే ఎన్నికల నిర్వహణపై స్పష్టత లేకుండా వ్యవహరిస్తున్నారని చెప్పారు.

2036 ఒలింపిక్స్‌కు హైదరాబాద్ బెస్ట్ ప్లేస్

- ఎక్స్‌లో స్పందించి రాజ్‌దీప్ సర్దేశాయి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఒలంపిక్స్-2036 పోటీలకు ఆతిథ్యమిచ్చేందుకు పోటీపడే నగరాల్లో హైదరాబాద్ మొదటి వరుసలో నిలుస్తుందని ప్రముఖ జర్నలిస్ట్ రాజ్‌దీప్ సర్దేశాయి ఎక్స్‌లో పేర్కొన్నారు. "నేను హైదరాబాద్‌ను సందర్శించిన ప్రతిసారీ, పాత ప్రపంచ ఆకర్షణను కొత్త శక్తులతో కలిసి భారత భవిష్యత్ నగరంగా కనిపిస్తుంటుంది. 2036లో జరిగే ఒలంపిక్స్‌కు భారతదేశంలో ఆతిథ్య నగరంగా మీరు దేన్ని ఎంపిక చేస్తారని అడిగితే మాత్రం హైదరాబాద్‌ను సూచిస్తాను. మౌలిక సదుపాయాలు, ల్యాండ్ బ్యాంక్, శక్తివంతమైన సేవారంగం, క్రీడా రంగంలో గొప్ప రికార్డు ఉన్న నగరం హైదరాబాద్" అని పేర్కొన్నారు. ఒలంపిక్స్ పోటీలకు ఇండియాలో ఆతిథ్యమిచ్చేందుకు అన్ని అర్హతలున్న నగరంగా హైదరాబాద్ ముందు వరుసలో ఉంటుందని అభిప్రాయపడ్డ రాజ్‌దీప్ సర్దేశాయికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

విద్యుత్ తీగలు తగిలి టిప్పర్ దగ్ధం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో: విద్యుత్ తీగలు తగిలి మంటలు చెలరేగడంతో టిప్పర్ లారీ సహా డ్రైవర్ దగ్ధమైన విషాద ఘటన సంగారెడ్డి జిల్లాలో జరిగింది. పోలీసులు, స్థానికుల వివరాల ప్రకారం.. ఖాజీపల్లి గ్రామంలో కంకర లోడు దింపేందుకు హైడ్రాలిక్ ద్వారా డ్రైవర్ ట్రక్కును పైకి లేపాడు. ఆ సమయంలో విద్యుత్ తీగలు ట్రక్కుకు తగిలి మంటలు చెలరేగి.. వాహనమంతటా వ్యాపించాయి. ఈ ఘటనలో మధ్యప్రదేశ్‌కు చెందిన డ్రైవర్ రామ్‌సృజన్ అగ్నికి ఆహుతయ్యాడు. ప్రమాదంపై ఐడిఎ బొల్లారం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్యారడైజ్ ఫ్లైఓవర్‌పై ట్రాఫిక్‌జామ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో: సికింద్రాబాద్‌లోని ప్యారడైజ్ ఫ్లైఓవర్ పైకి వేగంగా దూసుకెళ్లిన ఇన్నోవా కారు పక్కనే ఉన్న డివైడర్‌ను ఢీకొట్టి ఆగిపోయింది. అదే సమయంలో వెనుక నుంచి వచ్చిన మరో కారు డివైడర్‌పైకి దూసుకొచ్చి ఆగి ఉన్న ఇన్నోవాను ఢీకొట్టింది. కార్లలోని ఇద్దరు డ్రైవర్లకు గాయాలయ్యాయి. రెండు కార్లు ఢీకొనడంతో ఫ్లైఓవర్‌పైకి వెళ్లే దారి లేక భారీగా ట్రాఫిక్ స్తంభించింది.

గృహిణి ఆత్మహత్య

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో: సూరారం పోలీస్ స్టేషన్ పరిధిలోని ప్రియాంక కాలనీలో నివాసం ఉంటున్న రూప అనే గృహిణి ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. తన తల్లి, సోదరి వేధింపులే తన చావుకు కారణమని సూసైడ్ నోట్ రాసింది. మహబూబాబాద్‌కు చెందిన జంగారెడ్డి, సత్తమ్మల చిన్నకుమార్తె రూప వివాహం 2014లో గుండు జలంధర్ రెడ్డితో జరిగింది. వీరికి సిరిరెడ్డి, వేదాన్ష్? రెడ్డి సంతానం. శుక్రవారం ఉదయం 7.30 గంటల సమయంలో రూప సీలింగ్ ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఉండగా కూతురు సిరిరెడ్డి గమనించి తండ్రికి ఫోన్ చేసింది. దీంతో ఇరుగుపొరుగు వారు అక్కడికి చేరుకొని పోలీసులకు సమాచారం అందించారు.

కాళేశ్వరం ప్రాజెక్టును రద్దు చేయాలి

- కెసిఆర్ అంటేనే కాళేశ్వరం అన్నోళ్లు నోరు మూసుకున్నారు
- కమ్యూనిస్టులను లేకుండా చేసేందుకే కగార్ ఆపరేషన్
- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న కూనంనేని

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కాళేశ్వరం ప్రాజెక్టుపై సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు కీలక వ్యాఖ్యలు చేశారు. గత ప్రభుత్వం నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు పనికిరాదని, ప్రజలపై భారం మోపే ప్రాజెక్టును రద్దు చేయాలని అన్నారు. దాని నిర్వహణ కోసం ఏటా వేల కోట్ల రూపాయల ప్రజల సొమ్మును ఖర్చు చేయొద్దని సూచించారు. హనుమకొండ జిల్లాలోని హరిత కాకతీయ హోటల్ లో శనివారం మీడియా సమావేశంలో కూనంనేని సాంబశివరావు మాట్లాడారు. కెసిఆర్ అంటే కాళేశ్వరం.. కాళేశ్వరం అంటే కెసిఆర్ అన్నోళ్లు నేడు నోరు మూసుకున్నారని, తన మెదడును కరిగించి డిజైన్ చేశానని, కాళేశ్వరానికి అన్నీ నేనే అన్న కేసీఆర్ ఇప్పుడు నాకు సంబంధం లేదంటున్నారని చెప్పారు. కాళేశ్వరం ప్రాజెక్టు డిజైన్ బాధ్యత ఇంజినీర్‌లదే అంటూ నేడు తప్పించుకుంటున్నారని, ఇది అన్యాయమని అన్నారు. తుమ్మిడిహెట్టి వద్ద నిర్మించాల్సిన ప్రాజెక్టుకు మహారాష్ట్ర అనుమతి ఇవ్వలేదని, అందుకే కాళేశ్వరానికి మార్చామని చెబుతున్న హరీశ్‌రావు.. జనాలను ముంచే ప్రాజెక్టు కడతారా? అని ప్రశ్నించారు. 140మీటర్ల ఎత్తులో తుమ్మిడిహెట్టి దగ్గర ప్రాజెక్టు కట్టాలని తాము డిమాండ్ చేశామని, అక్కడ ప్రాజెక్టు నిర్మిస్తే అన్ని జిల్లాలకు సాగునీరు అందేదని చెప్పారు. కాళేశ్వరం నిర్మించాక చుక్కనీరు అదనంగా ఇవ్వలేదని, నేడు పంటలకు వచ్చేవి ఎల్లంపల్లి నీళ్లేనని చెప్పారు.

కేంద్ర ప్రభుత్వం మానవ హక్కులను ఉల్లంఘిస్తోందని, ఆపరేషన్ కగార్ పేరుతో కమ్యూనిస్టులను లేకుండా చేయాలని కలలు కంటున్నదని విమర్శించారు. మావోయిస్టుల మృతదేహాలను చూసి కేంద్రం భయపడుతోందన్నారు. మావోయిస్టులు తప్పు చేస్తే చట్టప్రకారం కేసులు పెట్టాలని, 2026 మార్చి నాటికి మావోయిస్టులను అంతం చేస్తామని చెప్పడం ఫ్యూడల్, గూండా, ఫాసిస్ట్ పాలనకు నిదర్శనం అని విమర్శించారు.కానీ, ఒక్క నంబాల కేశవరావును చంపితే దేశంలో కోట్లాది మంది స్పందించారని, అదీ కమ్యూనిస్టులకు ఉన్న మానవతావాదానికి నిదర్శనం అన్నారు. ఈ సమావేశంలో సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నేదునూరి జ్యోతి, జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి, మాజీ జిల్లా కార్యదర్శి సిరబోయిన కరుణాకర్, రాష్ట్ర సమితి సభ్యులు ఆదరి శ్రీనివాస్, మండ సదాలక్ష్మి, జిల్లా సహాయ కార్యదర్శులు తోట బిక్షపతి, మద్దెల ఎల్లేష్ ఉన్నారు.

బనకచర్లపై ఎందుకింత మౌనం..?

- రేవంత్, ఉత్తమ్‌లపై మాజీ మంత్రి హరీశ్ ఫైర్
- 'బనకచర్ల'పై పవర్ పాయింట్ ప్రజెంటేషన్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గతంలో కృష్ణా జలాలను దోపిడీ చేసినట్టుగానే ఇప్పుడు బనకచర్ల ప్రాజెక్టు రూపంలో గోదావరి జలాలను దోపిడీ చేసేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని మాజీ మంత్రి, బిఆర్ఎస్ సీనియర్ ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయంలో ముఖ్యమంత్రి రేవంత్, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ ఎందుకు మౌనంగా ఉంటున్నారని ఆయన ప్రశ్నించారు. కేటీఆర్ మీదా, బీఆర్ఎస్ నేతల మీదా అక్రమ కేసులు పెట్టటంలో సిఎం, మంత్రులు బిజీగా ఉన్నారని ఎద్దేవా చేశారు. వారికి ప్రతిపక్షాల మీద ఇరిటేషన్ తప్ప.. ఇరిగేషన్ మీద శ్రద్ధ లేదంటూ దుయ్యబట్టారు. తమ పదవుల కోసం తెలంగాణ ప్రయోజనాలను వారు తాకట్టు పెడుతున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. 'బనకచర్లపై మేం మౌనంగా లేం, చట్టపరంగా ముందుకెళుతున్నాం...' అంటూ మంత్రి ఉత్తమ్ వ్యాఖ్యానించిన నేపథ్యంలో హరీశ్‌రావు ఆయనకు కౌంటర్ ఇచ్చారు. శనివారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో 'బనకచర్ల'పై హరీశ్ పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. ఈ అంశంపై కేవలం లేఖలు రాయటం, వాటిని మీడియాకు విడుదల చేయటం కాదు... బనకచర్లను అడ్డుకోవటంపై నిజంగా మీకు చిత్తశుద్ధి ఉంటే అపెక్స్ కౌన్సిల్ మీటింగ్ నిర్వహించాలంటూ డిమాండ్ చేయాలని సవాల్ విసిరారు. ప్రాజెక్టు నిర్మాణానికి టెండర్లు పిలుస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు నోరు మెదపడం లేదని నిలదీశారు. తాత్కాలిక ఒప్పందానికి మించి ఏపీ ప్రభుత్వం కృష్ణా నీళ్లను తీసుకుపోతుంటే మౌనంగా చూస్తూ ఎందుకుంటున్నారని ప్రశ్నించారు. ఇదే విషయమై రాష్ట్రానికి చెందిన కేంద్ర మంత్రులు, బీజేపీ ఎంపీలు సైతం ఒక్క మాటా మాట్లాడటం లేదని విమర్శించారు.

నిధుల్లో, నదుల్లో తెలంగాణకు అన్యాయం జరుగుతున్నా మీకు పట్టదా? అని ఆవేదన వ్యక్తం చేశారు. బాబ్లీ ప్రాజెక్టు విషయంలో గతంలో చంద్రబాబు మహారాష్ట్రపై పెద్ద ఎత్తున పోరాటం చేశారని హరీశ్ ఈ సందర్భంగా గుర్తు చేశారు. అదే తరహాలో బనకచర్లపై రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ ఎందుకు పోరాడటం లేదని ప్రశ్నించారు. చంద్రబాబుతో దోస్తానా కోసం తెలంగాణ ప్రయోజనాలను తాకట్టు పెడతారా? అని సీఎంను అడిగారు. తెలంగాణ కంటే పదిశాతం నిధులను అదనంగా ఆంధ్రాకు ఇచ్చామంటూ కేంద్ర మంత్రి బండి సంజయ్ ప్రకటించారని గుర్తు చేశారు. మరోవైపు నదుల అనుసంధానం పేరిట ఎపి సర్కారు తన పరపతితో కేంద్రం నుండి నిధులను తెచ్చుకుంటోందని పేర్కొన్నారు.

ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య వంట మనిషి ఆత్మహత్య

ఆర్థిక ఇబ్బందులే కారణం..

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య ఇంట్లో వంట మనిషిగా పనిచేస్తున్న వ్యక్తి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన శుక్రవారం రాత్రి యాదగిరిగుట్టలో జరిగింది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపి వివరాల ప్రకారం.. మండలంలోని సైదాపురం గ్రామానికి చెందిన గంధమల్ల రవి(38) కొంతకాలంగా ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య ఇంట్లో వంట మనిషిగా పనిచేస్తూ.. అక్కడే కుటుంబంతో పై ఫ్లోర్‌లో నివాసముంటున్నాడు. అయితే, ఆర్థిక సమస్యలతోపాటు ఇటీవల తన ఇంటిపై తీసుకున్న రుణానికి ఇఎంఐ డబ్బులు చెల్లించకపోవడంతో బ్యాంక్ అధికారులు నోటీసులు జారీ చేశారు. అప్పు తెచ్చిన వారి నుంచి కూడా ఒత్తిడి ఎక్కువైంది. ఈ క్రమంలోనే శుక్రవారం రాత్రి పది గంటల సమయంలో ఎమ్మెల్యే ఇంట్లోని ఫోర్త్ ఫ్లోర్‌కి వెళ్లి రేకుల షెడ్డులో ఉరేసుకున్నాడు. పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. మృతదేహాన్ని కుటుంబం సమక్షంలోనే కిందికి దించి పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతునికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతుని భార్య గంధమల్ల నవిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు సీఐ భాస్కర్ వివరించారు.

బిసిల్లో భరోసా కల్పించే నాయకత్వం కావాలి

- యువత పుస్తకాలు చదివి గత చరిత్ర తెలుసుకోవాలి
- పుస్తకావిష్కరణ సభలో వక్తలు



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వక్తలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ సమాజానికి 'ఒబిసిల పోరుబాట' పుస్తకం స్ఫూర్తిదాయకమని, బిసిల్లో భరోసా కల్పించే నాయకత్వం కావాలని పుస్తకావిష్కరణ సభలో వక్తలు అన్నారు. మధ్యప్రదేశ్ ప్రిన్సిపల్ సెక్రటరీ, ఐఎఎస్ నరహరి, హైకోర్టు అడ్వకేట్ పృథ్వీరాజ్ సింగ్ సంయుక్తంగా రచించిన ఒబిసిల పుస్తకావిష్కరణ సభ శనివారం హైదరాబాద్ నాంపల్లిలోని సురవరం ప్రతాపరెడ్డి తెలుగు యూనివర్సిటీ ఆడిటోరియంలో జరిగింది. ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్సీ.. టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్‌గౌడ్, ఎమ్మెల్సీలు అద్దంకి దయాకర్, దాసోజు శ్రవణ్ హాజరై పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంపీ ఈటల మాట్లాడుతూ.. సమాజహితం కోరుతూ ఐఎఎస్ అధికారి నరహరి పుస్తకం రాయడం అభినందనీయమన్నారు. బీసీల్లో చైతన్యం, సామాజిక స్పృహ వచ్చింది కానీ తాను ఉన్నానంటూ భరోసా కల్పించే నాయకత్వం రావాలని ఆకాంక్షించారు.

ఎమ్మెల్సీ, టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్‌గౌడ్ మాట్లాడుతూ.. తమ పార్టీ అధినేత రాహుల్ గాంధీ బిసి నినాదాన్ని భుజానికి ఎత్తుకొని జోడో యాత్ర చేపట్టారన్నారు. సిఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలో సర్వే శాస్త్రీయబద్ధంగా జరిగిందన్నారు. బీసీలకు విద్యా, ఉద్యోగ, రాజకీయ రంగంలో 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ అసెంబ్లీ, శాసనమండలిలో రెండు బిల్లులను ఆమోదించామన్నారు. ఈ బిల్లులను కేంద్రం తొమ్మిదవ షెడ్యూల్లో చేర్చాలని తెలిపారు. బిసిలంతా కులాలు పక్కనపెట్టి, హక్కుల కోసం ఉద్యమించాలని పిలుపునిచ్చారు. యువత పుస్తకాలు చదివి గత చరిత్ర తెలుసుకోవాలని, అప్పుడే భవిష్యత్‌కు ముందడుగు వేసుకోవచ్చని చెప్పారు. ఎమ్మెల్సీ దాసోజు శ్రావణ్ మాట్లాడుతూ.. అన్ని రంగాల్లో బిసిలను అణగదొక్కుతున్న పరిస్థితి ఉందని, చట్ట సభల్లో ప్రాతినిథ్యం కోసం పోరాటం చేయాలని అన్నారు. ఐఎఎస్ అధికారి నరహరి మాట్లాడుతూ.. దేశంలో 80 కోట్ల మంది ఓబీసీల ఆశయాలు, ఆశలు, సమస్యలు, వాటి పరిష్కారాలపై 'ఒబిసిల పోరుబాట' పుస్తకాన్ని రాశానని తెలిపారు. ప్రభుత్వ నిర్ణయాలు, బడ్జెట్‌లో నిధులు, సంక్షేమ పథకాలు ఎవరికి, ఏ వర్గానికి ఎంత అందుతున్నాయో తెలియాలంటే కులగణనతోనే సాధ్యమన్నారు. జనాభా ప్రకారం ఒబిసిలకు రాజకీయ రిజర్వేషన్లు అమలు చేస్తే, అధికారంతోపాటు సామాజిక న్యాయం సాధ్యమవుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎబిఎస్‌పి జాతీయ సమన్వయకర్త, మాజీ డిజిపి డాక్టర్ జె పూర్ణచంద్రరావు, టిఎస్ఎండిసి చైర్మన్ ఈరవత్రి అనిల్ కుమార్, తెలంగాణ వాటర్ రిసోర్సెస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ వి ప్రకాష్, రిటైర్డ్ ఐఎఎస్ చిరంజీవులు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.